మురుగు పారే దారేది?

- వ్యర్థాలతో నిండిపోతున్న గెడ్డలు
- దోమలు, దుర్గంధంతో స్థానికుల అవస్థలు


వ్యర్థాలతో నిండిపోయిన రాజీవ్‌నగర్ గెడ్డ


ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన కూర్మన్నపాలెం ప్రధాన గెడ్డ

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెంలోని పలు ప్రాంతాల్లో మురుగు నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని గెడ్డలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగు పారే దారి లేక, వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. చెత్తాచెదారం, ఇసుక, మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి.. దుర్గంధంతో, దోమలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పందులకు ఆవాసంగా మారడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పరిసర ప్రాంత వాసులకు అవస్థలు తప్పడం లేదు.

తొలగించిన వ్యర్థాలు మళ్లీ గెడ్డలోకే..

కాలువలు, గెడ్డల సమీపంలో ఇళ్ల నుంచి వ్యర్థాలను వేయడం, ఎగువ ప్రాంతాల నుంచి వ్యర్థాలు వచ్చి చేరడంతో పూడిక నిండి, నీరు ముందుకు పారడం లేదు. గెడ్డలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడం, ఒకవేళ తొలగించినా.. వెంటనే తరలించకపోవడంతో ఆ వ్యర్థాలు మళ్లీ ఆ గెడ్డల్లోకే చేరుతున్నాయి.

ఆక్రమణలతో కుదించుకుపోతున్న వైనం

కొంతమంది మురుగు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో గెడ్డలు కుదించుకుపోయాయి. మురుగు కాలువలు కొన్నేళ్ల కిందట నిర్మించినవి కావడంతో చాలా చోట్ల గోడలు ధ్వంసమై, అధ్వానంగా మారాయి. గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను యంత్రాల సాయంతో శుభ్రం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మురుగు నీరు సాఫీగా ప్రవహించేందుకు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఎన్టీఆర్ కాలనీలో చెత్తతో పేరుకుపోయిన గెడ్డ

రక్షణ గోడలు సరిగ్గా లేక..

గెడ్డల రక్షణ గోడలు సరిగ్గా లేవు. అంతా అస్తవ్యస్తంగా ఉంటోంది. దీనికి తోడు పందులు చేరి చిందరవందర చేస్తున్నాయి. వ్యాధుల ముప్పు పొంచి ఉన్నందున అధికారులు స్పందించి, సిబ్బందితో ఎప్పటికప్పుడు చెత్త తొలగించేలా చూడాలి. పాడైన చోట్ల మరమ్మతులు చేపట్టాలి. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి.

–శివరామకృష్ణ, స్థానికుడు

చర్యలు చేపడతాం

నేను విధుల్లో చేరి 3 నెలలైంది. ప్రధానంగా వార్డులోని గెడ్డలపై దృష్టి పెడుతున్నాం. గెడ్డల ఆధునికీకరణకు ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే పనులను ప్రారంభించి, గెడ్డలను శుభ్రం చేయిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకుంటాం.

–సంతోష్,
86వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

క్లుప్తంగా

7న బీహెచ్‌పీవీ ఎంప్లాయిస్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

గాజువాక: బీహెచ్‌పీవీ ఉద్యోగస్తుల గృహ నిర్మాణ సహకార సంఘం వీకర్ సెక్షన్ అండ్ మైనార్టీ గ్రూప్ లిమిటెడ్ పాలకవర్గ సభ్యుల ఎన్నిక వచ్చేనెల 7న నిర్వహించనున్నట్టు ఎన్నికల నిర్వహణాధికారి ఎం.రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. 27న నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 7న ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్‌ను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ఖోఖోలో విద్యార్థినుల ప్రతిభ


విజేతలతో హెచ్‌ఎం కాంతం, పీడీ ఇస్మాయిల్

అక్కిరెడ్డిపాలెం: ఖోఖో క్రీడలో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభను చాటుతున్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో భీమిలి సెయింట్ ఆన్స్ స్కూల్‌లో స్టేట్ లెవెల్ స్కూల్ గేమ్స్ కాంపిటీషన్ –2023 ఖోఖో పోటీలు నిర్వహించారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, విశాఖ జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రెల్లా ఢిల్లీశ్వరి (6వ తరగతి), సాదొట్టి కీర్తన (8వ తరగతి), బోదంగి హేమలత (8వ తరగతి) ప్రతిభను కనబర్చి, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల పీడీ మహ్మద్ ఇస్మాయిల్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం విద్యార్థినులను అభినందించారు.

సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వినతి


ఎంపీ జీవీఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ మేరకు ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన ఎంపీ జీవీఎల్ వెంటనే దేవస్థానం అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కూడా లేఖ రాస్తామన్నారు. ప్రసాద్ పథకానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్పందనకు నాలుగు ఫిర్యాదులు

గాజువాక: స్పందన కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులకు నాలుగు ఫిర్యాదులు అందాయి. జీవీఎంసీ అధికారులు విధించిన అధిక ఆస్తి పన్నును తగ్గించాలని కోరుతూ రెండు దరఖాస్తులు, అనధికార నిర్మాణాలను తొలగించాలని కోరుతూ రెండు ఫిర్యాదులు అందినట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

గాజువాక: గాజువాక బీజేపీ నాయకులు 70వ వార్డులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ శ్రామికనగర్, కుంచుమాంబ కాలనీల్లో సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీలో రాష్ట్ర ఆరోగ్య బృందం పర్యటన

గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో రాష్ట్ర ఆరోగ్య బృందం సోమవారం పర్యటించింది. రాష్ట్ర ఆరోగ్య, వెల్నెస్ సెంటర్ కన్సల్టెంట్ డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో ఇక్కడ గర్భిణులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించారు. హెచ్‌బీలో గతనెల నిర్వహించిన 22 రక్త నమూనాల నివేదికలు, ఈనెల నిర్వహించిన 23 రక్త నమూనాల నివేదికల్లోని వ్యత్యాసాలు, ఇతర అంశాలను పరిశీలించిన అనంతరం పోషకాలను పెంచే ఆహారంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి కూడా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మహిళా వైద్యాధికారి డాక్టర్ ఉమావతి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, వైద్యాధికారులు డాక్టర్ బద్రినారాయణ మూర్తి, డాక్టర్ ఎ.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను వైద్య బృందానికి వివరిస్తున్న ఏఎన్‌ఎం

9న మరిడిమాంబ ఉత్సవాలు


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ శ్రీను

అగనంపూడి: కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలు వచ్చే నెల 9న నిర్వహించేందుకు ఆలయ కమిటీ సమావేశం నిర్ణయించింది. గ్రామంలోని సీతారాముల ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన మరిడిమాంబ, బంగారమ్మ అమ్మవార్ల ఆలయాల కమిటీ సమావేశంలో కమిటీల చైర్మన్ బలిరెడ్డి శ్రీను మాట్లాడారు. అగనంపూడిలో బొర్రమాంబ జాతర తరువాత అతి పెద్ద ఉత్సవమైన మరిడిమాంబ పండగ విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పిళ్లా కొండలరావు, విందుల వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ, సాయిన సన్యాసిరావు, పిళ్లా వెంకట ప్రసాద్, విందుల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కుంభా రవిబాబుకు అభినందనలు

ఉక్కునగరం: ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును ఉక్కునగరం స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అభినందించారు. రవిబాబుకు శాలువా కప్పి, బొకేతో సత్కరించారు. వారు మాట్లాడుతూ రవిబాబును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా, ఎస్టీలపై వైఎస్సార్‌సీపీకి ఉన్న గౌరవాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చాటి చెప్పారన్నారు. రవిబాబు నేతృత్వంలో ఎస్టీలు, గిరిజన ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందగలవన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎం.కె. నాయక్, ప్రధాన కార్యదర్శి జి.జి.సత్యనారాయణ, నాయకులు పి. గురుమూర్తి, ప్రదీప్ నాయక్ పాల్గొన్నారు.


రవిబాబును సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎస్టీ అసోసియేషన్ నాయకులు

సోమేశ్వరస్వామి దేవాలయం ఈవోపై ఫిర్యాదు

ఉక్కునగరం: అప్పికొండ సోమేశ్వరస్వామి దేవాలయం ఈవో శ్రీనివాసరావుపై దేవాలయం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు అలివేలు మంగతాయారు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నామినేట్ చేసిన ట్రస్టు బోర్డు సభ్యులకు మహాశివరాత్రి ఏర్పాట్లు గురించి తెలియజేయలేదని, ఫోన్ చేసి మాట్లాడటానికి ప్రయత్నించినా స్పందించటం లేదని దేవదాయ శాఖ కమిషనర్, సహాయ కమిషనర్‌లకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేవాలయం కాంట్రాక్టు గురించి కనీసం చర్చించడం లేదన్నారు. ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

పెండింగ్ సమస్యల పరిష్కారంలో కాలయాపన

ఉక్కునగరం: ఉక్కు కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో గుర్తింపు యూనియన్ కాలయాపన చేస్తోందని ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షుడు కరణం సత్యారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు ఆరోపించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తి, ఉత్పాదకతల కోసం కృషి చేస్తున్న కార్మికులకు మెరుగైన ఇన్సెంటివ్ ఇప్పించడంలో గుర్తింపు యూనియన్ యాజమాన్యాన్ని బతిమాలడం మాని, అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎం. కోటేశ్వరరెడ్డి, ఎం. అప్పారావు, ఎస్. మహాలక్ష్మినాయుడు, బి. రమణ, ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సత్యారావు

525 గ్రాముల గంజాయి స్వాధీనం

- ఏడుగురు అరెస్ట్
- విక్రయిస్తున్న ఇద్దరికి 14 రోజుల రిమాండ్

ఉక్కునగరం: రహస్య ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను, విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్–2, వడ్లపూడి రైల్వే క్వార్టర్ల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి. శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ సురేష్ నేతృత్వంలో ఆ ప్రాంతాన్ని ముట్టడించి, పరారు కావడానికి ప్రయత్నిస్తున్న వారిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో అప్పికొండ కాలనీకి చెందిన ఎస్.నవీన్ (24), వడ్లపూడికి చెందిన ఎం.జగదీష్ (21), పెదగంట్యాడకు చెందిన కె.రాజేష్ (30), మిందికి చెందిన డి.చంద్ర (20), రైల్వే క్వార్టర్స్‌కు చెందిన జి. ప్రభుదాస్ (26) ఉన్నారు. వారి నుంచి 25 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా వచ్చిన సమాచారం ద్వారా అగనంపూడికి చెందిన మహిళ జిల్లి నాయక్ (37) నుంచి 200 గ్రాములు, లంకెలపాలేనికి చెందిన డి.రాజమ్మ (47) వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వి. శ్రీనివాసరావు తెలిపారు. ఇద్దరు మహిళలను సోమవారం రాత్రి న్యాయమూర్తి వద్ద హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలియజేశారు.

20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి విడుదల చేశారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, సబ్జెక్టుల వారీగా పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.


పరీక్షల వివరాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గాజువాక: పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కార్మికుల సమస్యలను వివరించారు. రాత్రిపూట జాతీయ రహదారిలో పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్న కార్మికులకు భద్రతా పరికరాలు లేకపోవడం వల్ల వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. హైవేపై రాత్రిపూట కార్మికులతో కాకుండా స్వీపింగ్ మిషన్‌తో శుభ్రం పనులను చేయించాలని కోరారు. కార్మికులకు యాప్రాన్, రేడియం గౌన్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.సుబ్బారావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొల్ల రాము, గొలగాని అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత ప్లాంట్ నిర్వహణే లక్ష్యం

ఉక్కునగరం: శూన్య ప్రమాదాలు లక్ష్యంగా స్టీల్‌ప్లాంట్ ముందుకు సాగాలని ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జి అరుణ్ కాంతి బాగ్చీ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భద్రతా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భద్రతా పని విధానంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశీయ ఉక్కు పరిశ్రమల్లో ఉన్నత స్థానంలో ఉందన్నారు. వారోత్సవాలు నిర్వహించడం మాత్రమే కాకుండా, భద్రతా పరిస్థితులు మరింత మెరుగుపర్చేందుకు వినియోగించాలని కోరారు. క్లిష్టమైన పని ప్రదేశాల్లో భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ బి.కె. మొహంతి మాట్లాడుతూ ప్లాంట్ యంత్రాల నిర్వహణలో సీఎంఎం విభాగం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. సీజీఎం (సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఎం.ఎస్.వి. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి భద్రతతో కూడిన పని విధానం అవలంబించాలని కోరారు. సీఐఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నవీన్‌కుమార్, భద్రతా విభాగాధిపతి ఎస్.కె. రౌత్, విభాగాధిపతి గణేష్‌కుమార్, వివిధ సంఘాల నాయకులు కె.వి.డి. ప్రసాద్, కె.ఎస్.ఎన్. రావు, అయోధ్య రామ్, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భద్రతా వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

739వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 739వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన సీవో, సీసీపీ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని దేశప్రజలు, కార్మికవర్గం, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కనుక, కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటనలతో బెదిరేది లేదన్నారు. పోరాటం చేయడం ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న సీవో, సీసీపీ విభాగ కార్మికులు

నూతన బోధన విధానాలపై అధ్యాపకులకు శిక్షణ

అగనంపూడి: బోధనా విధానాలకు సాంకేతికతను జోడించి, అధ్యాపకులు మెరుగైన బోధనా పద్ధతులను అవలంబించాలని చెన్నై నిట్ ప్రొఫెసర్ వి.శివకుమార్ అన్నారు. 21వ శతాబ్దపు అధ్యాపకుల నూతన బోధనా విధానాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) సంయుక్తంగా నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాల ఆధారిత విద్య, 21వ శతాబ్దపు పాఠ్యాంశాలు, 40 దేశాల్లో బోధనా రీతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్, కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్, విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డీన్లు హరగోవిందరావు, నాగజ్యోతి తదితరులు ప్రసంగించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ శివకుమార్

ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల ఆవిష్కరణ

సీతంపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా అత్యంత ప్రాచీన జ్యోతిష్య గ్రంథాల ఆవిష్కరణ జరిగింది. పాతగాజువాక జ్యోతిష సరస్వతి పీఠం, ప్రముఖ జ్యోతిష్య పండితుడు నాగులకొండ ఆశ్లేషాచార్య సిద్ధాంతి రచించిన మూడు జ్యోతిష్య గ్రంథాలను సోమవారం శంకరమఠంలో స్వామి ఆవిష్కరించారు. 13వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రశ్న గ్రంథం ''భువన దీపిక', 15వ శతాబ్దానికి చెందిన ప్రముఖ ప్రశ్న గ్రంథం 'ప్రశ్న జ్ఞాన ప్రదీప', మహా పండిత డాక్టర్ సుఖదేవ చతుర్వేది ప్రణీత 'మూక ప్రశ్న విచార' గ్రంథాలు ఎంతో వివరణతో అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఆశ్లేషాచార్యులు తెలుగులోకి అనువదించారు. ఈ గ్రంథాలు ఎంతో విశిష్టమైనవని శంకర స్వామి ప్రశంసించారు. లోక కల్యాణార్థం రచించిన ఈ గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదివి, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని ప్రజలందరూ సుఖమయ జీవితాన్ని గడపాలని పీఠాధిపతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు మధురపాల శంకరశర్మ, పుచ్చా శ్రీనివాసరావు, కొప్పరవు కవుల మనవడు మా శర్మ, మోహన్ పబ్లికేషన్స్ అధినేత రామచంద్రరావు, నాగులకొండ సూర్యాచారి తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలు ఆవిష్కరిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

అఖండ మెజార్టీతో సుధాకర్‌ను గెలిపించాలి

- మరోసారి గాజువాక సత్తా చాటాలి
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి గాజువాక సత్తా మరోసారి చాటాలని పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతంరాజు సుధాకర్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, కన్వీనర్లు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు నాయకులంతా సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టభద్రులను ప్రత్యక్షంగా కలిసి వారి మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజు సుధాకర్‌ను వేసేలా చూడాలని కోరారు. ఇప్పటి వరకు పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేశామని, ఈ ఎన్నికల్లో కూడా గాజువాక నుంచి అత్యధికంగా ఓట్లు పడేలా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పట్టభద్రులకు వాటిని వివరించాలన్నారు. గాజువాక నియోజకవర్గం పరిధిలో 11వేల ఓటర్లను నమోదు చేశారని, వారిలో 9వేల మంది పోలింగ్‌కు వచ్చి ఓట్లు వేస్తే, విజయం మన వెంటే ఉంటుందన్నారు. ఎన్నికల సమయం ఆసన్నమైందని, ఇప్పటి నుంచి ప్రతి ఒక్కరూ పట్టభద్రుల వద్దకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, వార్డు ఇన్‌చార్జిలు కోమటి శ్రీనివాసరావు, ధర్మాల శ్రీను, బోగాది సన్నీ, మండల క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, నాయకులు మంత్రి రాజశేఖర్, రాజాన వెంకటరావు, పల్లా చినతల్లి, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, మహేశ్వరరెడ్డి, వెంపాడ అప్పారావు, కొయ్య భారతి, పూర్ణానందశర్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు